
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం

దేవి నవరాత్రుల్లో 7వ రోజు



మహాచండీ దేవి అలంకారం

సంపుటి : 1 సంచిక : 26 ఒంగోలు ఆదివారం 28-9-2025 ఎడిటర్ : కుమార్ పబ్లిషర్ : నరాల మురళీ పేజీలు : 4 వెల : రూ. 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

## దేశ ప్రజలను దోచుకునేందుకు కాంగ్రెస్ ఏ అవకాశాన్ని వదిలిపెట్టలేదు

### ఒడిశా పర్యటనలో ప్రధాని మోదీ పలు కీలక ప్రాజెక్టులు ప్రారంభం



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. దేశ ప్రజలను దోచుకోవడానికి కాంగ్రెస్ ఏ అవకాశాన్ని కూడా వదిలిపెట్టలేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ తక్కువ ఆదాయం వర్గాలపై పన్నులు విధించిందని విమర్శించారు. ఒడిశా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ శనివారం జర్సుగూడలో జరిగిన కార్యక్రమంలో రూ.60 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. అలాగే బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ కాంగ్రెస్‌పై ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ప్రజలను దోచుకోవడంలో కాంగ్రెస్ ఏ అవకాశం

మిగతా 2లో

## విజయ్ ర్యాలీలో తొక్కిసలాట

### చిన్నారులు సహా 36మందికి పైగా మృతి!



**కరూర్ :** తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం-TVK అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన ర్యాలీలో అపశ్రుతి చోటు చేసుకుంది. తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి పలువురు అస్వస్థతకు గుర య్యారు. బాధితులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో 36మంది మరణించినట్టు తెలుస్తోంది. వీరిలో చిన్నారులతో పాటు పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఇంకా మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను కరూర్‌లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కరూర్‌లో నిర్వహించిన విజయ్? ప్రచార సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో తొక్కిసలాట జరిగింది. దీంతో పరిస్థితి గమనించిన విజయ్ ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి వారికి నీళ్ల బాటిళ్లను అందించారు. మరోవైపు భారీ

మిగతా 2లో

## కాఫీలు రుచిగా లేవ్



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఏపీ శాసన మండలిలో చిన్న చిన్న విషయాలు పెద్ద పెద్ద వివాదాలుగా మారుతున్నాయి. గత రెండు రోజులుగా కూడా మండలిలో వివాదాలు పెరుగుతున్నాయి. మండలి ఛైర్మన్ మోషేన్ రాజుకు అవమానం జరిగిందని పేర్కొంటూ .. వైసీపీ

మిగతా 2లో

## ఏపీలో అంతర్జాతీయ వర్సిటీ




**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఏపీ శాసనమండలిలో కీలకమైన ఆరు బిల్లులకు ఆమోదం లభించింది. అంతర్జాతీయ వర్సిటీ ఏర్పాటుతోపాటు మరో ఐదు బిల్లులను సభ్యులు ఆమోదించినట్లు మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. అనంతరం శాసనమండలిని

మిగతా 2లో

## ఊపిరి ఉన్నంత కాలం

# పేదల కోసమే

### ఏటా పింఛన్లకు రూ.32,143 కోట్లు - చంద్రబాబు



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** సూపర్-6 పథకాలు, మేనిఫెస్టో హామీల అమలుపై శాసనసభలో ప్రసంగించారు ముఖ్యమంత్రి చంద్రబాబు - దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఇవ్వనన్ని పింఛన్లను ఏపీలో ఇస్తున్నామని వెల్లడి

సూపర్-6 పథకాలు, మేనిఫెస్టో హామీల అమలుపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం కింద పెద్ద ఎత్తున పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఇవ్వనన్ని పింఛన్లను మన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు పింఛన్లను ఇవ్వకుండా వృద్ధులను ఇబ్బంది పెట్టిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఉన్న సచివాలయ సిబ్బందితోనే పోటీ పడి తొలిరోజునే 97 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేస్తున్నామని తెలిపారు.

నెలకు రూ. 2,745 కోట్లను పింఛన్లకు ఖర్చు చేస్తున్నామన్నారు. మొత్తంగా 63.50 లక్షల మందికి పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. పింఛన్లు అందుకుంటున్న వారిలో 59 శాతం మంది మహిళలే ఉన్నారని, పింఛన్లు ఇవ్వడమే కాకుండా పంపిణీ ఎలా జరుగుతుందన్న అంశం మీద లబ్దిదారుల నుంచి అభిప్రాయాలు కూడా తీసుకుంటున్నామన్నారు. ఏడాదికి రూ.32,143 కోట్లు పెన్షన్ల నిమిత్తం కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్న చంద్రబాబు, ఆంధ్ర తర్వాత తెలంగాణ, కేరళ రాష్ట్రాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ఏడాదికి రూ.8,179 కోట్లు, కేరళ రూ.7,295 కోట్లు పెన్షన్లు కింద ఖర్చు పెడుతున్నాయన్నారు. పెన్షన్ల కోసం కూటమి ప్రభుత్వం ఖర్చు పెట్టే దాంట్లో పావు వంతు ఖర్చు పెడుతున్నాయని వివరించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు రూ.8.86 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. స్త్రీ శక్తి వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగిందని గుర్తు చేశారు. ఉచిత బస్సు స్కీంకు ఏడాదికి రూ.2,963 కోట్లను ప్రభుత్వం ఆనందంగా ఖర్చు పెడుతుందని తెలిపారు. స్త్రీ శక్తి పథకం తనకు చాలా సంతృప్తినిచ్చిన పథకమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. డ్రైవర్లు, కండక్టర్లు స్త్రీ శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియడారు. రాష్ట్రంలో ఉన్న 97 శాతం మందికి స్త్రీ శక్తి పథకం గురించి తెలుసునని, 85 శాతం మంది స్త్రీ శక్తి పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. స్త్రీ శక్తి పథకం అమలుతో సోషల్ గేదరింగ్ పెరిగిందని అభిప్రాయపడ్డారు. మహిళలకు ఉచిత ప్రయాణాల వల్ల డబ్బు

మిగతా 2లో



## వాయుగుండం ప్రభావం

### ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు

**కర్నూలు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు దంచికొట్టాయి. అనేక ప్రాంతాల్లో వాగులు పొంగి పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహించి ఇళ్లల్లోకి చేరింది. చాలా చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా కురిసిన వానలకు తడిచి దాదాపు 60 గొర్రెలు మృతి చెందాయి. పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎమ్మిగనూరు,

మిగతా 2లో

## ఐరాసలో ఇజ్రాయెల్ ప్రధాని ప్రసంగం



**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో ప్రసంగించడానికి వేదికపైకి చేరుకున్నప్పుడు జరిగిన 'మాస్ వాక్‌అవుట్' సంఘటన అంతర్జాతీయ వేదికపై తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ దృశ్యం వీడియో రూపంలో అధికంగా వైరల్ అయింది. లి సంఘటన నేపథ్యం.. నిరసన నెతన్యాహు ప్రసంగానికి ముందు పలు దేశాల ప్రతినిధులు తమ సీట్లను వదిలి లేచి వెళ్లిపోవడం ఈ సంఘటనలో కీలకం. ఈ నిరసనకు ప్రధాన కారణం గాజా యుద్ధంలో ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్యలపై అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆవేదన.. వ్యతిరేకత అని విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రధానంగా అరబ్, ముస్లిం.. కొన్ని ఆఫ్రికా దేశాల ప్రతినిధులు

మిగతా 2లో

## వైసిపి నేతల గొప్పలు ప్రజలకు తిప్పలు !

### ప్రచార ఆర్భాటం అమలులో శూన్యం!?..పేదలకు ఇల్లన్నారు సెంటుకే పరిమితం చేశారు? లోతట్టు ప్రాంతాల్లో జగనన్న కాలనీలు!?.. చెరువుల్లా మారుతున్న కాలనీలు!?



**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** తమ ప్రచార అరబాటమే తప్ప అమలులో నిర్లక్ష్యం వహించడంలో ఘనపాటిగా గత వైసిపి ప్రభుత్వం అవలంబించిందని ఆరోపణలు లేకపోలేదు. పథకాల పేరుతో ప్రచార ఆర్భాటం చేసి ప్రజలకు తిప్పలు సృష్టించారని విమర్శలు లేకపోలేదు. ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న కాలనీ ఇస్తామని చెప్పి లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు ఇవ్వడం వల్ల కాలనీలన్నీ జలమయమై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని దీనినే తాము ప్రతి ఒక్కరికి ఇల్లు ఇచ్చాము సుందరంగా నిర్మించుకొని హాయిగా ఉన్నారు అని ప్రచారాలు చేస్తున్నారని కనిగిరి మండల వాసులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.గతంలో గూడు లేని పేదలకు ఇల్లు ఇస్తారని చెప్పి ఒక్క సెంటు కే పరిమితం చేశారనీ,మాట తప్పని మడమ తిప్పని జగన్మోహన్ రెడ్డి మాటలు తప్ప చేసిందేమీ లేదు. కనీసం 3 సెంట్లు ఇచ్చేలా చూస్తే పేదలకు అనుకూలంగా ఉంటుంది. అదేవిధంగా గతంలో టీడీపీ అధికారంలో ఉండంగా టిడ్కో గృహాలు ఇవ్వడం జరిగింది. వాటిని కూడా లబ్ధిదారులకు అందజేయలేదు. వాటిని ఇవ్వకపోగా బ్యాంకులో

మిగతా 2లో



## దసరా పండగ ఎఫెక్ట్ !

### హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ ట్రాఫిక్ జామ్

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :**

దసరా పండగకు సొంతూళ్లకు వెళ్లే వారితో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. దీంతో హైదరాబాద్‌లోని విజయవాడ హైవేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఈ మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. భారీ వర్షాల కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి వద్ద వంతెనపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో అక్కడ వాహన రాకపోకలు నిలిచిపోయాయి. గౌరెల్లి వంతెన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి స్థానికులను అప్రమత్తం చేశారు. మరోవైపు వర్షాలకు ఉప్పల్ చౌరస్తా వద్ద

మిగతా 2లో

### గంజాయి, మాదకద్రవ్యాల

## నిర్మూలనపై ఉక్కుపాదం

ప్రత్యేక నిఘా పెడుతున్న ప్రకాశం జిల్లా పోలీసులు

ఒంగోలు రైల్వే స్టేషన్, రైళ్లలో పోలీసులు విస్తృత తనిఖీలు

రైలులో సుమారు 9 కిలోల గంజాయి స్వాధీనం



**ప్రకాశం, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ప్రకాశం జిల్లా పోలీ సులు మాదకద్రవ్యాల వినియో గం, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు. ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం, సిబ్బంది, మరియు మాదకద్రవ్యాలను గుర్తించే ప్రత్యేక శిక్షణ పొందిన స్లీపర్ డాగ్ రాక్సీ తో కలిసి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు, ప్రదేశాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు మరియు ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో 26 రాత్రి బొకారో ఎక్స్‌ప్రెస్ (ధన్‌బాద్ %-% అల్లెప్పీ) రైలులో ఒక యువకుడు (18 సంవత్సరాలు) వద్ద

మిగతా 2లో

(మొదటి పేజీ తరువాయి)

## ఏ అవకాశాన్ని వదిలిపెట్టలేదు

వదల్లేదు. సంవత్సరానికి రూ.2 లక్షల ఆదాయం ఉన్నవారిపైనా పన్ను విధించింది. బీజేపీ ప్రభుత్వం ఆ పరిమితిని రూ.12 లక్షలకు పెంచింది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వారు ప్రజలను దోచుకుంటున్నారు. ఎన్?డీఏ ప్రభుత్వం జీఎస్?టీలో సంస్కరణలు తీసుకురావడం వల్ల ప్రజలకు ఉపశమనం కలిగించింది. సిమెంట్ ధరలు తగ్గించాం. అయితే హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పన్ను విధించింది. దేశవ్యాప్తంగా ధరలు తగ్గినా, కాంగ్రెస్ మాత్రం ప్రజలకు ఆ ఉపశమనం కల్పించడానికి ఇష్టపడటం లేదు' అని ప్రధాని మోదీ ఆరోపించారు.

**టెలికాం రంగంలో భారత్ మరింత అభివృద్ధి : మోదీ**

స్వదేశీ సాంకేతికతతో 4జీ సేవలను ప్రారంభించిన ప్రపంచంలోని ఐదు దేశాల్లో భారత్? ఒకటిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. బీఎస్?ఎన్?ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ప్రారంభించడం దేశానికే గర్వకారణమని తెలిపారు. భారత్ అభివృద్ధిని సూచిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం వల్ల దేశంలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. భారతదేశ స్వయంసమృద్ధి సాధనకు తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతతో దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని చెప్పారు. టెలికమ్యూనికేషన్స్, రైల్వే, ఉన్నత విద్య వంటి రంగాలకు సంబంధించి రూ.60వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఐఐటీల విస్తరణకు శంకుస్థాపన చేశారు. స్వదేశీ సాంకేతికతతో రూ.రూ.37,000 కోట్ల వ్యయంతో నిర్మించిన 97,500 పైగా 4జీ టవర్లను మోదీ ప్రారంభించారు. దీంతో టెలికాం పరికరాల ఉత్పత్తి, తయారీలో భారత్ డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాల సరసన చేరింది. అలాగే గుజరాత్‌లోని సూరత్ జిల్లాను ఉద్నాతో కలిపే అమృత్ భారత్ రైలుకు ఆయన జెండా ఊపారు. రూ.1400 కోట్ల వ్యయంతో నిర్మించిన కోరాపుట్–బైగూడ రైలు మార్గాన్ని, 82 కిలోమీటర్ల మనబార్, కోరాపుట్, గోరాపుర్ సెక్షన్‌ను ప్రధాని జాతికి అంకితమిచ్చారు.

## విజయ్ ర్యాలీలో తొక్కిసలాట

సమూహంలో అంబులెన్సులు అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. సామర్థ్యానికి మించి జనం రావడంతో ఈ ఘటన జరిగినట్లుగా భావిస్తున్నారు. "ఇప్పటి వరకు 31 మంది మరణించగా, 58 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సీఎం వెంటనే స్పందించి కలెక్టర్?, ఎస్పీ, నన్ను ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఆదివారం ముఖ్యమంత్రి స్టాలిన్? ఇక్కడి వచ్చి క్షతగాత్రులను పరామర్శిస్తారు. 46 మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో, మరో 12 మంది ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు నమక్కల్?, సేలం జిల్లాల నుంచి కరూర్?కు వైద్యులను పిలిపిస్తున్నాం. తొక్కిసలాటలో గాయపడిన వారి వద్ద నుంచి ఛార్జీలు వసూలు చేయవద్దని ప్రైవేట్ ఆస్పత్రుల వారికీ సూచించాం. ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని సీఎం ఆదేశాలు ఇచ్చారు."

**సెంథిల్ బాలాజీ, తమిళనాడు మాజీ మంత్రి**

ఆస్పత్రులను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశాలు

మరోవైపు ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 36 మంది మరణించినట్లు సమాచారం ఉందని, ఇందులో 8 చిన్నారులు, 16 మంది మహిళలు ఉన్నారని చెప్పారు.మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్ష పరిహారం ప్రకటించారు. హైకోర్టు రిటైర్ట్ జడ్జీ జస్టిస్? అరుణ జగదీశన్? ఆధ్వర్యంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. క్షతగాత్రుల కోసం ఆస్పత్రులను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు సుబ్రమణియన్?, అంబిల్? మహేశ్?లను ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. 'కరూర్ నుంచి వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు అన్ని రకాల సాయం అందించాలని ఆరోగ్యశాఖ మంత్రి, కలెక్టర్‌కు ఆదేశించా. కరూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను సూచించాను. వైద్యులు, పోలీసులకు సహకరించాలని కరూర్ పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాను. తిరుచ్చి, సేలం, దిండిగుల్ కలెక్టర్లను కరూర్?కు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించాను" అని ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సీఎం స్టాలిన్ ఆదివారం కరూర్?లోని ఘటనా స్థలిని పరిశీలించనున్నట్లు వెల్లడించారు. తమిళనాడులో తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్?నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంతాపం వ్యక్తం చేశారు. "కరూర్‌లో ప్రచార సభలో దురదృష్టకర ఘటన తీవ్రంగా కలచివేసింది. బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ కష్ట సమయంలో వారికి మనోధైర్యం అందించాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని మోదీ ఎక్స్?లో పోస్ట్ చేశారు.

## కాఫీలు రుచిగా లేవ్

భ్యులు పెద్ద వివాదం చేశారు. మండలిని స్తంభింపజేశారు కూడా. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం.. ఆయనకు ఆహ్వానం అందాలి. అయితే.. ఈ విషయంలో ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే ఆయ నను పక్కన పెడుతోందని వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తాజా సర్వేలో చాలా మార్పు అయితే.. దీనిపై ప్రభుత్వం తరఫున ఎలాంటి సమాచారం రాలేదు. పైగా.. అధికారులే తప్పు చేశారని మంత్రులు తేల్చేసి చేతులు దులుపుకొన్నారు. ఇదిలా వుంటే.. తాజాగా మరోరెండు విషయాలు మండలిలో చర్చకు వచ్చాయి. అసెంబ్లీ, శాసన మండలిలో క్యాంటీన్లు వేర్వేరుగా ఉంటాయి. రెండూ కూడా ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే.. తాజాగా మండలి చైర్మన్ స్వయంగా జోక్యం చేసుకుని.. అసెంబ్లీ క్యాంటీన్‌లో కాఫీకి.. మండలి క్యాంటీన్‌లో కాఫీకి మధ్య రుచి తేడా గా ఉందని తెలిపారు. దీనికి వైసీపీ సభ్యులు ఔనంటూ.. సమాధానం ఇచ్చారు.

## ఏపీలో అంతర్జాతీయ వర్సిటీ

నిరవధిక వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆరు బిల్లులలో ప్రధానమైనది న్యాయవిద్య, పరిశోధన కోసం అమరావతిలో భారత అంతర్జాతీయ వర్సిటీ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇక అదేవిధంగా ఏపీ ప్రైవేటు వర్సిటీ (స్థాపన, క్రమబద్ధీకరణ) చట్టం–2025, ఏపీ వర్సిటీల సవర్ణ బిల్లు – 2025ను కూడా శాసనమండలి ఆమోదించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుష్టువ్యాధి అనే పదం తొలగించేందుకు చేసిన చట్ట సవరణకు మండలి ఆమదం తెలిపింది. ఏపీ వ్యవసాయ భూమి (వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు) చట్టం 2006 బిల్లు, ఏపీ పబ్లిక్ సర్వీసులకు నియామకాల నియంత్రణ, వేతన సరళీకరణ బిల్లు – 2025, టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయిని డిప్యూటీ కలెక్టరుగా నియమించే ప్రతిపాదన కోసం చేసిన చట్ట సవరణను సభ ఆమోదించింది.

## పేదలకోసమే

కూడా ఆదా అయిందని, ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదలకు స్త్రీ శక్తి పథకం తోడ్పడిందన్నారు.

**సమర్ధవంతంగా తల్లికి వందనం పథకం :** తల్లికి వందనం పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 10 వేల కోట్లను తల్లికి వందనం పథకానికి ఖర్చు పెట్టామన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే, అంత మంది పిల్లలకు తల్లికి వందనం అమలు చేశామని వెల్లడించారు. ఇప్పటికీ తల్లికి వందనం పథకం ఎవ్వరికైనా అందని వారుంటే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 2,79,720 మందికి రూ.363.64 కోట్లు అందచేస్తున్నామని వివరించారు. మొత్తం తల్లికి వందనం లబ్దిదారులు 66,57,508 మంది విద్యార్థులు ఉన్నారని సీఎం తెలిపారు. దీపం–2.0 పథకం అమలు చేశామని, తన తల్లి వంటింట్లో పడే కష్టాలను చూసి మరే మహిళా ఆ కష్టాలు పడకూడదని ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం పెట్టామని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు దీపం–2.0 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 2.66 కోట్ల ఉచిత సిలిండర్లు మహిళలకు అందచేశామని దీని నిమిత్తం రూ.1718 కోట్లను ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు.

**డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు బలోపేతం :** డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశామని, మహిళలు పెద్ద ఎత్తున డబ్బులను పొదుపు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించేస్తున్నారని కొనియడారు. డ్వాక్రా మహిళల్లో కేవలం 1 శాతం మాత్రమే ఎన్పీఏలు ఉన్నారంటే మహిళా శక్తి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్పీఏలుగా మారుతున్నారన్న చంద్రబాబు, కానీ డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను నిఖార్సుగా తిరిగి చెల్లిస్తున్నారని కొనియడారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం స్పష్టం చేశారు. మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. ప్రతి ఎమ్మెల్యే 1000 మంది మహిళలను గుర్తించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు సాయం అందిస్తున్నామన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చానన్న చంద్రబాబు, రైతును ఆదుకునే బాధ్యతను తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

**2030 నాటికి 6జీ సేవలు – టెక్నాలజీని ఎవరూ ఆపలేరు: చంద్రబాబు**

రైతుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని తేల్చిచెప్పారు. అన్నదాత సుఖీభ కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చామన్న సీఎం, గత ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద రూ.7,500 ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తోందన్నారు. మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ పథకంతో జోడించి ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మొత్తంగా 46.86 శాతం మంది రైతులకు రూ. 3,174 కోట్లను అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం అందజేశామని తెలిపారు. ఇదే కాకుండా రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో పాటు సలహాలు ఇస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, స్పెషల్ ప్యాకేజీలు ఇస్తున్నమన్నారు.

**ఊపిరి ఉన్నంత కాలం పేదల కోసమే :** కూటమి ప్రభుత్వం ఓ టీం అని, ఈ టీంలో ఏ ఒక్కరు తప్పు చేసినా చాలా నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు పర్సనల్ అజెండాలు పెట్టుకుని మాట్లాడితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యానికి విఘాతం కలుగుతుందని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఎన్డీఏ సంకల్పానికి ప్రతి ఒక్కరూ పని చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేయడం, తెలుగు జాతిని నెంబర్–1 రాష్ట్రంగా చేయడానికి అందరూ పని చేయాలని కోరారు. వేంకటేశ్వర స్వామి తనకు ప్రాణభిక్ష పెట్టాడన్న చంద్రబాబు, ఊపిరి ఉన్నంత కాలం పేదల కోసమే పని చేస్తానని స్పష్టం చేశారు. పేదల కోసమే అనునిత్యం ఆలోచన చేస్తున్నానన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది కాబట్టే 15 నెలల కాలంలో ఇన్ని కార్యక్రమాలను చేయగలిగామని గుర్తు చేశారు. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ సహకారంతో ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందని వెల్లడించారు.

**ప్రజలందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ :** తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు పెడితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాన్ని మరింత అభివృద్ధి చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. 2014–19 మధ్య కాలంలో రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు పెట్టామని, కానీ ఏపీలో దౌర్భాగ్యం అన్న క్యాంటీన్లను వైఎస్సార్సీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించామని వెల్లడించారు. ఇప్పుడు 204 అన్న క్యాంటీన్లు ఉన్నాయని, త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా 70 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు అన్న క్యాంటీన్ల ద్వారా 5.72 కోట్ల భోజనాలు పెట్టామని, రూ.104 కోట్ల మేర సబ్సిడీని అందించామని వివరించారు. ప్రతి దేవాలయంలో అన్నదానం కార్యక్రమం చేపడతామని తెలిపారు. రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార పంపిణీ చేపడుతున్నామని 14వేల70 కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. రేషన్ మాఫియాను అరికడుతు, రేషన్ డిపోలను పునః ప్రారంభించామని గుర్తు చేశారు.

## వాయుగుండం ప్రభావం

మంత్రాలయం, నందవరం, గోనెగండ్ల, పెద్దకడబూరు మండలాల్లో పంటలు నీట మునిగాయి. పత్తి కాయలు కుళ్లి తీవ్ర నష్టం మిగిల్చింది. ఆదోనిలో రాంజల చెరువు పూర్తిగా నిండిపోయి పొంగి పొర్లుతోంది. ఆదోని శివారు ఆవు–దూడ వంక ఉధృతంగా ప్రవహించింది.

**కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు :** పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదోని మండలం బసాపురంలో వరద చేరింది. ఎమ్మిగనూరులో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దేవనకొండ మండలంలో 15 ఏళ్ల తర్వాత నేలతలమరి చెరువు నిండి రహదారిపై ప్రవహిస్తోంది. గోనెగండ్ల మండలంలో మల్లెలవాగు ఉప్పొంగింది. గంజహళ్లి గ్రామంలోని కాలనీలు నీట మునిగాయి. దేవనకొండ–గోనెగండ్ల మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

**మృత్యువాత పడ్డ 60 గొర్రెలు :** గూడూరు తహశీల్దార్ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరి కంప్యూటర్లు, టేబుళ్లు ఇతర సామగ్రి తడిచి ముద్దయ్యాయి. ఉద్యోగుల విధులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కౌతాళం మండలంలో వాగులు పొంగిపొర్లుతున్నాయి. పత్తి, మిరప పంటలు వర్షపు నీటిలో తెలియాడుతున్నాయి. హాల్వి గ్రామంలోని లోతట్టు కాలనీల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. వానకు తడిచి సుమారు 60 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దేవనకొండ మండలం పొట్లపాడులో హంద్రీ ఉగ్రరూపం దాల్చటంతో పంట పొలాలు నీట మునిగాయి. పొట్లపాడు గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరింది.

**నిలిచిపోయిన రాకపోకలు :** మహానంది సమీపంలోని పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహానంది–బోయలకుంట వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండలం సిద్ధాపురం అలుగు పొంగటంతో కర్నూలు–గుంటూరు మార్గంలో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను నంద్యాల–గిద్దలూరు మీదుగా దారి మళ్లించారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు 15 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. రెండు గేట్లను ఎత్తి 13,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటింది. దక్షిణ ఒడిశా–గోపాల్‌పూర్ సమీపంలో వాయుగుండం తీరాన్ని తాకింది. ఇది పశ్చిమ దిశగా ఛత్తీస్‌గఢ్ వైపు కదిలి బలహీనపడుతుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వీటి ప్రభావం వలన తెలుగు రాష్ట్రాలకు మరొక 24 గంటల పాటు వర్షాలు పడుతాయని హెచ్చరించారు. శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్ టీఆర్ , పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖ, గంగవరం, కాకినాడ పోర్టుల్లో 3వ నంబరు హెచ్చరికలు జారీ చేశారు.

## ప్రధాని ప్రసంగం

వాక్‌అవుట్‌లో పాల్గొనగా.. కొంతమంది యూరోపియన్ ప్రతినిధులు కూడా ఇందులో భాగమయ్యారు. ఈ సంఘటన ప్రపంచ మీడియా శీర్షికల్లో నిలిచి, అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక ప్రభావశీల సంజ్ఞగా మారింది, గాజాలో మానవతా హక్కుల ఉల్లంఘనలు.. ప్రపంచ న్యాయ ప్రయోజనాలపై కొత్త డిమాండ్‌లకు అవకాశం కల్పించింది. లినెతన్యాహు ప్రసంగం.. వివాదాస్పద వ్యాఖ్యలు వాక్‌అవుట్ నేపథ్యంలో కూడా నెతన్యాహు తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆయన హమాస్‌పై సైనిక చర్య కొనసాగించాలని.. "మన పని ముగించాల్సి ఉంది" అని ఉత్సాహపూరితంగా వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని నిరోధించాలని, బంధీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పశ్చిమ దేశాల పలు నిర్ణయాలపై వ్యతిరేక అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో 31 మంది మృతి నెతన్యాహు తన ప్రసంగాన్ని గాజాలోని ప్రజలకు లౌడ్‌స్పీకర్లు.. ఫోన్ల ద్వారా కూడా ప్రసారం చేయించినట్లుగా సమాచారం ఉంది. ఈ చర్య సభకు ముందు కూడా వివాదాలను మిలియన్ల మంది దృష్టికి తీసుకెళ్లింది.

## నేడు గుర్రం జాషువ జయంతి వేడుకలు



**కనిగిరి ప్రజలకి చేరువ ప్రతినిధి :** కనిగిరిలో ఆదివారం నవయుగ కవి చక్రవర్తి కవి కోకిల గుర్రం జాషువ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైసిపి పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలు ఉదయం 8:00 గంటలకు కనిగిరి పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గరగల జాషువా విగ్రహానికి నివాళులు అర్పించబడుననీ,కావున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలోపాల్గొన వలసిదిగా కోరుతూ ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రకటన విడుదల చేశారు.

## వైసిపి నేతల గొప్పలు

తాకట్టు పెట్టడం జరిగింది.పైగా ఇల్లు ఇవ్వకపోగా నెలవారీ కంతు కట్టాలని వారికి నోటీసులు కూడా వెళ్లడం జరిగింది. జగనన్న కాలనీలు ఊరికి దూరంగా ఉన్నాయి. కనిగిరిలో జగనన్న కాలనీ అయితే వర్షం వస్తే చెరువులను తలపించేలా ఉన్నాయి. అంతే కాకుండా పిల్లలు ఈత కొట్టే పరిస్థితి ఉంది. దూరంగా ఇచ్చిన కాలనీ లను రద్దు పరచి వారికి 3 సెంట్లు స్థలం ఇవ్వాలని కోరారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే భూములను ఒకటికి మూడు రెట్లు పెంచేసి ప్రభుత్వానికి అధిక మొత్తానికి విక్రయించి దోచుకోవడం జరిగింది. ఇందుకు గాను కనిగిరి నియోజకవర్గంలో సుమారు 18 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కనిగిరి మండలంలో 25 గ్రామాలు ఉంటే 25 పంచాయతీలో 1795 సాంక్షన్ చేస్తే 64 ఇల్లు మాత్రమే కట్టారు. హెచ్ఎంపాడు మండలంలో 803 కు జీరో కట్టారు, వెలిగండ్ల మండలంలో 21 పంచాయతీలు ఉంటే 1200 మంజూరు చేస్తే 20 కట్టారు. సి ఎస్ పురం మండలంలో 23 పంచాయతీలకు గాను ల్యాండ్ లెవలింగ్ కు మాత్రం ఖర్చు చేశారు కేటాయించింది ఏమీ లేదు. పిసి పల్లి మండలంలో ఈ విధంగా డబ్బులన్నీ దుర్వినియోగం చేసారు. ఇలా దుర్వినియోగం చేసిన వారి మీద ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదు. ఇటీవల జ్యోతిరావు పూలే స్కూల్ కి స్థలం అడిగితే అక్కడ నీటి కట్టడాలు ఉన్నాయి ఇవ్వడానికి వీలు లేదన్నారు. అదే జగనన్న లే ఔట్ కు మాత్రం అదే నీటి కుంటల్లో,సమాధిలలో ఇచ్చారు. పేదలకు పట్టాలు ఇవ్వాలంటే జిడిపి ల్యాండ్ ఈ భూములు ఇవ్వడాని లేదని చెప్తున్నారు. కాబట్టి వీటి మీద ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటే స్థలాలు అందుబాటులో లేవు. యడవల్లి పంచాయతీలో నాయకులు 1 సెంట్ స్థలం ఇస్తే వారు మాత్రం 3 సెంట్ల స్థలంలో నిర్మించుకున్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వానికి ఎటువంటి జీవో లు ఉండవా అని ప్రశ్నించారు. హెచ్ఎం పాడు మండలం హనుమంటాపురంలో ఎస్సీలకు కేటాయించిన 43 పట్టాలకి 15 లక్షలు వెచ్చించి అదే పట్టాలని వైఎస్ఆర్ ప్రభుత్వం ఇవ్వటం జరిగింది. గతంలో ఉన్న ఏ ఈ 30 వేలు లంచం తీసుకుని ప్రజలను మోసం చేశాడు. ఇలాంటి అవకతవకలుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నిర్మూలనపై ఉక్కుపాదం

నుండి సుమారు 6 కిలోల గంజాయి, మరొక బోగీలో 3 కిలోల గంజాయి స్వాధీనం చేశారు. మొత్తం 9 కిలోల గంజాయి స్వాధీనం చేసి, తదుపరి దర్యాప్తు కోసం జి.ఆర్.పి. పోలీసులకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో స్లీపర్ డాగ్ రాక్సీ కీలక పాత్ర పోషించింది. రాక్సీ వాసన ద్వారా అనుమానాస్పద వస్తువులను గుర్తించి, పోలీసుల చర్యలకు దోహదం చేసింది. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలను ఏ విధంగానూ సహించబోము. ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుంది. సమాజ భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలను నిర్మూలించడమే పోలీసుల లక్ష్యం.ప్రకాశం జిల్లా పోలీసులు ఇలాంటి ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరం కొనసాగిస్తూ, ప్రజల సహకారంతో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టే దిశగా కృషి చేస్తున్నారు. పోలీసులు చేపడుతున్న చర్యలు సమాజంలో అవగాహన పెంచడంతో పాటు, యువతలో మత్తు పదార్థాలపై వ్యతిరేక భావనను కలిగించడానికి ఉపయోగపడుతున్నాయి.గంజాయి మరియు మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు.ఈ తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్, ఎస్సైలు శ్రీకాంత్, శివ రామయ్య, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా పండగ ఎఫెక్ట్ !

వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి.

**నగరవాసులు స్వస్థలాల బాట :** దసరా పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు స్వస్థలాల బాట పట్టారు. రేపటి (ఆదివారం) నుంచి కళాశాలలకు సెలవులు ప్రారంభం కావడం, పిల్లలకు ఇప్పటికే సెలవులు ఉండటం, మరోవైపు సోమవారం సద్దుల బతుకమ్మతో అందరూ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఇవాళ్టి నుంచే ప్రయాణాలు ప్రారంభించారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిలో వాహనాల రద్దీ పెరిగింది.

**విజయవాడ వైపు వాహనాలు బారులు :** వాహనాల రద్దీతో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్? పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సరే ట్రాఫిక్? సమస్యలు మాత్రం నివారించలేకపోయారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి (65వ నంబర్)లో వాహనాల రద్దీ పెరిగింది. విజయవాడ వైపు వాహనాలు బారులు తీరుతున్నాయి. పట్టణ వాసులంతా ఒక్కసారిగా పల్లెబాట పట్టడంతో హైదరాబాద్ నగరంలోని ప్రధాన రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. టోల్? గేట్ల వద్ద కూడా రద్దీ కనిపిస్తోంది. వాహనాలు వేగంగా వెళ్లేందుకు, ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

**రేపు కూడా ఇదే పరిస్థితి :** మరోవైపు నిన్నటి నుంచి కురుస్తున్న వర్షంతో హైదరాబాద్ రహదారులపై నీరు నిలవడం కూడా వాహనాల వేగాన్ని ఆలస్యం చేస్తోంది. దీనికితోడు ఇటీవలి వర్షాలకు పలుచోట్ల రోడ్లపై గుంతలు పడ్డాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రోడ్లపై వరద నీటితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రద్దీ రాత్రి వరకు ఇలాగే కొనసాగుతుంది. రేపు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. బంగాళాఖాతంలో వాయుగుండం తీరం దాటింది. దక్షిణ ఒడిశా–గోపాల్‌పూర్ సమీపంలో వాయుగుండం తీరాన్ని తాకింది. ఇది పశ్చిమ దిశగా ఛత్తీస్‌గఢ్ వైపు కదిలి బలహీనపడుతుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలకు మరో 24 గంటలపాటు వర్షాలు పడుతాయని హెచ్చరించారు. శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్ టీఆర్ , పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖ, గంగవరం, కాకినాడ పోర్టుల్లో 3వ నంబరు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఈరోజు ఉదయం 10 గంటలకు 6,09,607 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. కోనసీమలోని కనకాయలంక కాజ్? వే వరద ముంపు బారిన పడటంతో ఆ గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. కోనసీమలోని వశిష్ట వైనతేయ గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు జోరుగా ప్రవహిస్తున్నాయి.

### శ్రీ లలితాంబిక అలంకరణలో

# భక్తులకు దర్శనం



**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి** కనిగిరి కేటీఆర్ టెక్నో పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం లో శనివారం దేవీ నవరాత్రులు సందర్భముగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శ్రీ లలితా అమ్మవారు అలంకరణలో భక్తులుకు దర్శినమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమ అర్చనలు వైభవంగా ఈ సందర్భంగా నిర్వహించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందురు తిరుపతి రెడ్డి గారు దంపతులు పూజలు నిర్వహించారు.

# చైర్మన్ మాణిక్యరావును కలిసిన మోషే



**ఉలవపాడు, ప్రజలకు చేరువ ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఉలవపాడు నుండి మిర్యాలగూడ వెళ్తుండగా మార్గమధ్యంలో కరేడు ర్యాంప్ దగ్గరలో హ్యాపీ ఫ్రూటీ హోటల్ నందు మర్యాదపూర్వకంగా కలిసిన నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే . ఈసందర్భంగా మాణిక్యరావుతో మోషే మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో (2019 - 2024 ) ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కేసులను సైతం లెక్కచేయకుండా పార్టీ పిలుపు మేరకు పనిచేసిన వారికి ప్రభుత్వపరమైన నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులలో కూడా ప్రాధాన్యత కల్పించేలా ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు , మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మోషే తో పాటు ఉలవపాడు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు రావినూతల రమేష్ , ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ , ఉలవపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు చిరుతోటి గిరిబాబు , గౌడపేరు మరియదాసు , జడ భాస్కర్ రావు , పేముల నల్లయ్య , ఏసుపోగు యోహాను , ఎండ్లూరి రవి బాబు మాణిక్యరావును కలిసిన వారిలో ఉన్నారు.

# ఉచిత న్యాయ సేవలపై అవగాహన



**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** పేదరికం వల్ల ఏ వ్యక్తి న్యాయ సేవలను కోల్పోవద్దనే లక్ష్యంతో ఉచిత న్యాయ సేవలు అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. శనివారం కనిగిరి పట్టణంలోని పి. వి. ఆర్ పార్క్ నందు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయ సేవల పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించడం, న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేని పేదవారికి ఉచిత న్యాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తున్నదన్నారు. వివిధ అంశాల్లో లబ్ధిదారులకు సహకారం అందజేస్తున్నదని పేర్కొన్నారు. వివిధ కేసుల్లో కక్షిదారులను సమన్వయపర్చి రాజీ కుదుర్చడం ద్వారా న్యాయం చేయడానికి కృషి చేస్తుందని ఇందుకోసం న్యాయవాదులు, పోలీసులు,కక్షిదారులు, సిబ్బంది, అధికారుల సమన్వయంతో లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్,పారా లీగల్ వాలంటీర్ మంద్రు రమేష్ బాబు మాట్లాడుతూ గతంలో హక్కులు, చట్టాల గురించి సామాన్యులకు అవగాహన ఉండేది కాదని, న్యాయసేవాధికార సంస్థ కృషితో ప్రస్తుతం అందరికీ హక్కులపై అవగాహన వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పారా లీగల్ వాలంటీర్ అర్నూరి తిరుపతయ్య,న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో


# దర్శనం ఇచ్చిన అంకమ్మ తల్లి



**కందుకూరు, ప్రజలకిచేరువ ప్రతినిధి :** కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీ శ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ఎంతో వైభవంగా కలుగుతున్నాయి. శనివారం ఆరవ రోజు శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంలో శ్రీ అంకమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. నల్లమల్లి శ్రీరామూర్తి, దారుకుమల్లి వెంకట నరసారెడ్డి,బొగ్గవరపు సత్యనారాయణ, అనుమాలశెట్టి శ్రీకాంత్,వెంపరాల వెంకటకృష్ణారెడ్డి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరిం చారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, అష్టోత్తరం నిర్వహించారు. అమ్మవారిని కన్నుల పండుగ అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి ఎంతో వైభవంగా పల్లకి సేవ జరిగింది. సాయంత్రం మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణం పఠించారు. అమ్మవారి పల్లకి సేవ ముందు పడమటి బలిజ పాలెం వారి కోలాటం, శ్రీ నటరాజనాట్యమండలి సరస్వతి నిలయం వారి కోలాటం భక్తులను ఆకట్టుకుంది. జై అంకమ్మ తల్లి నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వర స్వామి సన్నిధిలో

# ప్రత్యేక పూజలు



**కనిగిరి, ప్రజలకిచేరువ ప్రతినిధి :** ఉదయగిరి నియోజక వర్గంలోని వరికుంటపాడు వద్ద వెలసివున్న శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఇరి కోటిరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

### బ్రహ్మయ్యకు నివాళులర్పించిన

# వైసీపీ నాయకులు



**హనుమంతునిపాడు /కనిగిరి, ప్రజలకి చేరువ**

శుక్రవారం ఉదయం పొదిలి మండలం పోతవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఆ మృతులల్లో హనుమంతునిపాడు గ్రామానికి చెందిన మచ్చ బ్రహ్మయ్య ఒకరు. బ్రహ్మయ్య అంత్యక్రియలు శనివారం హనుమంతుని పాడులో జరిగాయి. హనుమంతునిపాడు మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు బ్రహ్మయ్యకు నివాళు లర్పించారు. మాజీ ఎంపిపి గాయం బలరామిరెడ్డి, వైసీపీ మండలపార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కత్తి రాజారావుతోపాటు పలువురు వైసీపీ నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కుటుంబ సమేతంగా అమ్మవారిని

# దర్శించుకున్న దద్దాల



**కనిగిరి, ప్రజలకి చేరువ**

విజయవాడ ఇంద్రకీలాద్రి దసరా మహోత్సవాల్లో భాగంగా కనకదుర్గ అమ్మవారిని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతోపాటు కనిగిరి నియోజకవర్గంలోని ప్రజలకు ఆయురారోగ్యాలలు, సిరిసంప దలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన పూజలు చేశారు. ఈయన వెంట కుటుంబ సభ్యులతోపాట సైకం ఏడుకొండలురెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు,

### పొదిలిలో ఫ్రాంచ్ ఎక్స్‌ప్రెస్

# కొరియర్ సర్వీస్ ప్రారంభం

**పొదిలి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**



**పొదిలి, ప్రజలకి చేరువ :** పొదిలి పట్టణంలోని జూనియర్ కాలేజీ రోడ్డులో నూతనంగా ఫ్రాంచ్ ఎక్స్ ప్రెస్ కొరియర్ సర్వీస్‌లను ఆంధ్రప్రదేశ్ ఆ సంస్థ డైరెక్టర్ సిరాజుద్దీన్ శనివారం ప్రారంబించ్చారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎ. జోసఫ్(విజయవాడ), ఒంగోలు హబ్ మేనేజర్ తేజ,పొదిలి బ్రాంచ్ మేనేజర్ జి. చిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదిలి చుట్టుప్రక్కల ప్రాంత ప్రజలు కొరియర్ సర్వీస్ ను సద్వినియోగం చేసకోవాలన్నారు

### మూడు గంటలకే

# మూతపడుతున్న సచివాలయాలు

**అధికారుల స్పందించరు.. ప్రజలకు అందని సేవలు**



**వి మాడుగుల, ప్రజలకిచేరువ ప్రతినిధి :** సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం పుణ్యమా అని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందరం దయానియంగా మారింది. ఉదయం 10 గంటలకల్లా చివరానికి చెందిన సిబ్బంది సాయంత్రం ఐదు గంటల వరకు విధి నిర్వహణలో ఉండాలి. కానీ సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో వారికే తెలియడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యంగా వెదురు నిర్వహించడానికి మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం అధికంగా ఉందనే ఆరోపణలు లేకపోలేదు. అనకాపల్లి జిల్లా విమాడుగుల మండలంలోని పోతనపూడి అగ్రహారంలో ఉన్న సచివాలయ పరిస్థితి మరీ కడు దయానియంగా మారిందని ఆరోపణలు వెళ్ళు వెత్తుతున్నాయి. ఈ సచివరంలో సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో వారికి తెలియడం లేదని ప్రజలు తమ సమస్యల కోసం సచివరనికొస్తే సిబ్బంది దొరకడం లేదని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. శనివారం ఓ లబ్ధిదారిని మూడు గంటలకు రేషన్ కార్డులో పేరు మార్పు కోసం సచివరానికి వస్తే సచివాలయం తలుపులు వేసి ఉండడంతో పాటు సిబ్బంది ఎవరు కనిపించకపోవడంతో ఆమె కూర్చుని కూర్చుని తిరిగి వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. ఈ సమస్యను విలేకరులకు తెలియపరచగా విలేకరుల సంఘటన స్థలానికి రాగా సిబ్బంది ఎవరు కనిపించకపోవడం గమనార్హం. సచివాలయ సిబ్బందికి మూడు గంటల వరకే విధి నిర్వహణ సమయం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది పనితీరును మెరుగుపరిచి ప్రజలకు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

### లలిత త్రిపుర సుందరి దేవిగా

# లలితా పరమేశ్వరి దర్శనం



**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కనిగిరి పట్టణంలోని శివనగర్ కాలనీ దత్త పీఠం లో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల నడుమ నిర్వహిస్తున్నట్లు దత్తా పీఠం నిర్వాహకులు సాగర్ దత్త తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా శనివారం 6వ రోజు కావడంతో భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూల అలంకరణ, ఉబయదాతలు ఉదయం ద్రోణాదుల వీరయ్య విజయలక్ష్మి పండిట్ సాయంత్రం బీమవరపు శ్రీనివాసులు రవణమ్మ చింతలపూడి వెంకటేశ్వర్లు జయలక్ష్మి చేత అమ్మవారికి పుష్పార్చన, శ్రీ చక్ర కుంకుమార్చన, నవదుర్గల పూజ, లక్ష్మి గణపతి హోమం, రుద్ర హోమం చేయించడం జరిగింది. దత్తపీఠమును ప్రతిరోజు ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా మేళ తాళాలతో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేస్తున్నట్లు దత్త పీఠం నిర్వాహకులు సాగర్ దత్త తెలియజేశారు. ఈ దసరా ఉత్సవాల లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు. పూజలో పాల్గొను భక్తులు ముందుగా 8333933313 నెంబరు సంప్రదించగలరన్నారు.

# టీటీడీ ఉద్యోగులకు వస్త్ర బహుకరణ

**ఏటా వస్త్రాలు అందిస్తున్న వేమిరెడ్డి దంపతులు**

**దాతృత్వం పరంగా వేమిరెడ్డి కుటుంబం ఎప్పుడూ ముందుంటుంది : టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు**




**తిరుపతి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** టిటిడి సిబ్బందికి వస్త్ర వితరణ చేసి మరో సారి వేమిరెడ్డి దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి సేవలో పాల్గొంటున్న వేలమంది తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వస్త్ర బహుకరణ చేశారు. శనివారం ఎంపీ వేమిరెడ్డి దంపతులు. టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు గారి చేతుల మీదుగా టీటీడీ సిబ్బంది, వేద పండితులు, వాహన బేరర్స్, అర్చకులు, లడ్డూ పోటు వర్కర్స్, కల్యాణకట్టలో విధులు నిర్వహించే సిబ్బంది, అలాగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటున్న ఇతర విభాగాల సిబ్బందికి వారు వస్త్రాలు అందించారు. తమ సేవలు గుర్తించి ఏటా వస్త్ర బహుకరణ నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులకు ఆయా విభాగాల ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ. గత 6 సంవత్సరాలుగా టీటీడీ ఉద్యోగులకు వస్త్ర బహుకరణ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వామివారికి సేవలు చేసే వారికి సేవ చేయడం చాలా సంతోషంగా ఉంటుందన్నారు. అందుకే వేద పండితులు, వాహన బేరర్స్, అర్చకులు వంటి వివిధ విభాగాల సిబ్బందికి వస్త్ర బహుకరణ చేపట్టామన్నారు. శ్రీవారి ఆలయంలో వివిధ సేవలు చేసే సిబ్బందిని గుర్తించి ఎంతో గొప్ప మనసుతో వస్త్ర బహుకరణ చేపట్టిన వేమిరెడ్డి దంపతులకు టీటీడీ ఛైర్మెన్ బిఆర్ నాయుడు అభినందనలు తెలియ జేశారు. బ్రహ్మోత్సవాలు అంటే పండుగ వాతావరణమని, ఇలాంటి వాతావరణంలో కొత్త బట్టలు పెట్టడం హర్షణీయమన్నారు. దాతృత్వం పరంగా వేమిరెడ్డి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. వేంకటేశ్వరస్వామివారి పట్ల అచంచలమైన భక్తి విశ్వాసాలు కలిగి ఉన్న వేమిరెడ్డి దంపతులకు శ్రీవారి ఆశీసులు ఎప్పుడూ ఉంటాయని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బందికి వస్త్ర బహుకరణ నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ట్రాఫిక్ సమస్య కలిగించ వద్దు

**వాహనాలు కేటాయించిన ప్రదేశాలలో నిలపాలి .. చిరు వ్యాపారులు రోడ్లపైకి రావద్దు.. ఎస్సై కె. మాధవరావు**

**కనిగిరి, ప్రజలకి చేరువ :** వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్ సమస్యను కలిగించవద్దని హనుమంతునిపాడు ఎస్సై కె. మాధవరావు అన్నారు. శనివారం ఆయన కనిగిరి పట్టణంలో పోలీస్ సిబ్బందితోకలిసి పర్యటించారు. వాహనదారులకు పోలీస్ వారు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే వాహనాలు నిలపాలని లేనిచో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిరు వ్యాపారం చేసుకునే తోపుడు బండ్లు వాళ్ళు రోడ్లపైకి రావద్దని హెచ్చరించారు. కనిగిరి డియస్పి, మరియు సిఐ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక శ్రద్ధపెట్టారు. రాత్రిల్లు సమయంలో కూడ పట్టణంలోని చివారు ప్రాంతాలలో గస్థి ముమ్మరం చేశారు.



## మారనున్న కనిగిరి ముఖ చిత్రం

**20 నుండి 28కిపెరగనున్న వార్డుల సంఖ్య**
**29 నుండి జరనున్న వార్డుల విభజన**

**కనిగిరి, ప్రజలకిచేరువ**

2026లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు కనిగిరి వార్డుల ముఖచిత్రం మారనుంది. ఇప్పటి వరకు 20 వార్డులుగా ఉన్న కనిగిరి మున్సిపాలిటి 28 వార్డులుగా రూపుదిద్దుకోనుంది. ఈనెల 29 నుండి అక్టోబర్ 4 వరకు వార్డుల హద్దులను మున్సిపల్ అధికారులు కేటాయించునున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు అందజేశారు. కనిగిరి మున్సిపాలిటీ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమయ్యారు. అయితే కనిగిరి పంచాయతీ నుండి మేజర్ పంచాయతీగా మరియు మున్సిపాలిటీలుగా పేర్లు మారయే తప్ప నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని పట్టణ ప్రజలనుండి విమర్శలు వినపడుతున్నాయి. నిజం చెప్పాలంటే పంచాయతీగా ఉన్నప్పుడు కనిగిరి పట్టణం ఎలా ఉందో నేటికీ అలానే ఉంది.

# మాలకొండలో భక్తుల అభిప్రాయాలకే పెద్దపీట

**ఎమ్మెల్యే ఇంటూరి.. వంద రూపాయల టికెట్‌పై వదంతులను నమ్మవద్దు.. యథాతథంగా కొనసాగుతుందని స్పష్టీకరణ**

**వలేటివారి పాలెం ప్రజలకి చేరువ ప్రతినిధి :** వలేటివారిపాలెం మండలం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద శనివారం సాయంత్రం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశ నిర్వహించారు. మాలకొండ దేవస్థానం లో ఇటీవల జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఆలయ సందర్శన అనంతరం కొన్ని మార్పులు సూచించిన నేపథ్యంలో, ఆలయ అభివృద్ధి ప్రణాళికలు మరియు వదంతులపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టతనిచ్చారు.

**భక్తుల మనోభావాలకు ప్రాధాన్యత :** ఆలయానికి భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోందని, వారంలో పదివేల మందికి పైగా స్వామివారిని దర్శించుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం కొన్ని మార్పులు అవసరమని జాయింట్ కమిషనర్ సూచించారని, అయితే ఏ మార్పు అయినా క్షేత్రస్థాయిలో భక్తుల అభిప్రాయ సేకరణ తర్వాతే ఉంటుందని తాను ఈవో (కార్యనిర్వహణాధికారి) గారికి మరియు జేసీ గారికి స్పష్టంగా చెప్పినట్లు ఆయన వెల్లడించారు. గర్భగుడిలో టెంకాయలు కొట్టడం వల్ల కలిగే ఇబ్బందుల దృష్ట్యా, దానిని బయటకు మార్చాలనే సూచన వచ్చిందని, అయితే భక్తుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ, ఆలయానికి సమీపంలోనే ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**వంద రూపాయల టికెట్ రద్దు అవాస్తవం**

వంద రూపాయల దర్శనం టికెట్‌ను రద్దు చేసి, ఆలయాన్ని కేవలం ధనికులకే పరిమితం చేస్తున్నారని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. రూ. 100 టికెట్ యథాతథంగా కొనసాగుతుంది. గతంలో మాదిరిగానే



గర్భగుడిలో పూజలు చేసి, శఠారి ఇస్తారు. ఈ విషయంలో ఎటువంటి మార్పు లేదు. కేవలం ప్రజలను, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారు అని ఆయన అన్నారు. త్వరలోనే ఆలయానికి నూతన పాలకమండలిని ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే భక్తులు, విదేశాల నుంచి వచ్చే వారి కోసం రూ. 500 ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయాలనేది కేవలం ఒక సూచన మాత్రమేనని, దానిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. నూతన పాలకమండలి, అధికారులు, మరియు భక్తులతో చర్చించిన తర్వాతే వీవీఐపీ దర్శనాలపై ఒక స్పష్టమైన విధానం రూపొందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి కన్సల్టెన్సీని నియమించడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా నూతనంగా వివాహం చేసుకునే వారి కొరకు కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్వామి భక్తులకు నాణ్యమైన భోజనం అందించేందుకు, విడిగా భక్తులు నుంచి వచ్చే బియ్యం కాకుండా, నాణ్యమైన ప్యాకెట్ రైస్‌ను ఉపయోగించి అన్నదానం చేస్తున్నామని, దీనిపై భక్తుల నుంచి మంచి స్పందన వస్తోందని అన్నారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలను రూ. 3,200 నుంచి రూ. 6,400 కు పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నెల రోజుల్లో దీనిపై సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి, అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఆలయాలలో ధూపదీప నైవేద్యాల కొరకు అర్చకులకు రూ. 10,000 అందిస్తున్న ముఖ్యమంత్రి గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారికి ఆలయ అధికారులు వేద పండితులు ఘన స్వాగతం పలికారు. తదుపరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు అనంతరం వేద పండితులు స్వామివారి తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్ వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు నార్నే రోశయ్య ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆ జోనర్‌లో నానితో సుజీత్ నెక్స్ట్



టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ సుజీత్.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీతో థియేటర్స్ లో సందడి చేస్తున్న విషయం తెలిసిందే.


టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ సుజీత్.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీతో థియేటర్స్ లో సందడి చేస్తున్న విషయం తెలిసిందే. గ్యాంగ్ స్టర్ డ్రామాగా సినిమాను రూపొందించిన సుజీత్.. ఫ్యాన్స్ ఎలా కోరుకున్నారో అంతకుమించి పవన్ ను చూపించారు. వరల్డ్ వైడ్ గా అభిమానుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. అయితే ఇంకాస్త స్క్రిప్ట్ పై పని చేసుంటే బాగుండేదని మూవీ లవర్స్ అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఇప్పటి వరకు మూడు సినిమాలు సుజీత్ తీయగా.. అందులో రెండు సీరియస్ యాక్షన్ జోనర్ లోనే ఉన్నాయి. ఎక్కువగా యాక్షన్ జోనర్ కే తొలి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కామెడీని సుజీత్ మిస్ అవుతున్నారట. ఆ విషయాన్ని ఆయనే తెలిపారు. ఓజీ పోస్ట్ ప్రమోషన్స్ లో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్న సుజీత్.. ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో యాక్షన్ అనేది తన బ్లడ్ లోనే ఉందని, అందుకే ఆ ఎలిమెంట్ తప్పక కనిపిస్తుందని తెలిపారు. కానీ కామెడీ మిస్ అవుతున్నట్లు చెప్పుకొచ్చారు. అందుకే భవిష్యత్తులో విభిన్నమైన జోనర్స్ లో తీస్తానని తెలిపారు. దీంతో సుజీత్.. తన అప్ కమింగ్ మూవీ డార్క్ కామెడీ జోనర్ లో ఉంటుందని అంతా అనుకుంటున్నారు. అయితే తన తదుపరి చిత్రం వచ్చే ఏడాది ఎటువంటి ఆలస్యం లేకుండా విడుదల అవుతుందని హామీ ఇచ్చారు సుజీత్. నేచురల్ స్టార్ నానితో వర్క్ చేస్తున్నట్లు తెలిపారు. క్లారిటీ ఇచ్చిన సుజిత్ ఆ సినిమాకు బ్లడీ రోమియో అనే టైటిల్ అనుకుంటున్నట్టు, ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయినట్లు తెలిపారు. ఆ మూవీ షూటింగ్ చాలా కష్టమని, అది వేరే రకమైన ఎడిటింగ్ ప్యాటర్న్, మ్యూజిక్ తో కూడిన ప్రయోగాత్మక చిత్రంగా చెప్పారు. ఎక్కువ భాగం షూటింగ్.. యూరప్ లో జరిగే ఒకే షెడ్యూల్ తో ముగుస్తుందని తెలిపారు. ది ప్యారడైజ్ సినిమాను నాని పూర్తి చేసిన తర్వాత తన సినిమా షూట్ ప్రారంభమవుతుందని అన్నారు. దీంతో సుజీత్ గత చిత్రాల్లో మాస్ ఎలిమెంట్స్ ఎక్కువగా చూపించగా.. ఇప్పుడు కాస్త కొత్తగా తీయనున్నట్లు అర్థమవుతోంది. సుజీత్ మిస్ అవుతున్నట్లు చెప్పిన కామెడీ అంశాలు నాని సినిమాలో ఉంటాయని అంతా అంచనా వేస్తున్నారు. సరైన యాక్షన్ అంశాలతో కూడిన చమత్కారమైన డార్క్ కామెడీ ఎంటర్టైనర్ గా ఉండబోతోందని వినికిడి.

# నందమూరి తమన్ కాస్త కొణిదెల తమన్!





సంగీత దర్శకుడు తమన్‌కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. డ్రమ్మర్ గా కెరీర్ స్టార్ట్ చేసిన ఆయన.. ఇప్పుడు తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ గా కొనసాగుతున్నారు. తనదైన టాలెంట్ తో దూసుకుపోతున్నారు. వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తూ సూపర్ హిట్స్ అందుకుంటున్నారు. నందమూరి బాలకృష్ణ సినిమాలకు వర్క్ చేసి ఓ రేంజ్ లో మెప్పించారు. బాలయ్య, తమన్ కాంబోకు మంచి క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. నటసింహం డిక్టేటర్, అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ చిత్రాలకు తమన్ స్వరాలు అందించారు. ఆయా సినిమాల విజయంలో తమన్ మ్యూజిక్ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు అఖండ-2కు కూడా ఆయనే వర్క్ చేస్తున్నారు. దీంతో తమన్ ను నందమూరి తమన్ అని పిలుస్తుంటారు ఫ్యాన్స్. ఆయనకు నందమూరి తమన్ అనే ట్యాగ్ ను ఇచ్చేశారు. రీసెంట్ గా బాలయ్య కూడా అదే విషయాన్ని తెలిపారు. అంతే కాదు.. నందమూరి ఫ్యామిలీ ఈవెంట్స్ లో తమన్ కనిపిస్తున్నారు. అయితే ఇప్పుడు తమన్.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాకు ఆయన మెయిన్ పిల్లర్ అనే చెప్పాలి. యాక్షన్ సీక్వెన్స్ కు తమన్ ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గూస్ బంప్స్ తెప్పించిందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. కొన్ని సీన్స్ అయితే థియేటర్స్ లో కేరింతలు.. ఈలలే ఈలలు. దీంతో ఓజీ మూవీ ఫ్యాన్స్ కు బాగా నచ్చిందంటే ముఖ్య కారణం తమనే. అందుకే ఇప్పుడు.. కొణిదెల తమన్ ను పిలుచుకుంటున్నారు.

# ప్రశాంత్ వర్మ మూవీ..




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. హనుమాన్ మూవీతో ఎలాంటి హిట్ అందుకున్నారో అందరికీ తెలిసిందే. యువ నటుడు తేజ సజ్జా లీడ్ రోల్ లో నటించిన ఆ సినిమాను సూపర్ హీరో కథకు ఇతిహాసాన్ని ముడిపెట్టి ప్రశాంత్ వర్మ తెరకెక్కించారు. సిల్వర్ స్క్రీన్ పై మ్యాజిక్ చేసి మంచి విజయాన్ని అందుకున్నారు. అప్పుడే హనుమాన్ ను సీక్వెల్ గా జై హనుమాన్ ఉంటుందని ప్రకటించారు. తన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా సినిమా వస్తుందని తెలిపారు. హనుమాన్ మూవీకి మించి వంద రెట్లు భారీ స్థాయిలో జై హనుమాన్ ఉంటుందని చెప్పడంతో ఇప్పటకే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ అవుతుందని అప్పట్లో ప్రశాంత్ వర్మ చెప్పినా.. ఇంకా షూటింగ్ కూడా మొదలుకాలేదు. రీసెంట్ గా తేజ సజ్జా ఆ సినిమా అప్డేట్ ఇచ్చిన సంగతి విదితమే. ప్రశాంత్ వర్మ, రిషబ్ శెట్టి ఇద్దరూ వారి ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారని చెప్పారు. వాళ్ల చేతిలోని చిత్రాలు అయిపోయాక జై హనుమాన్ పనులు స్టార్ట్ అవుతాయని చెప్పారు. ఇప్పుడు రిషబ్ శెట్టి తన అప్ కమింగ్ మూవీ కాంతార ప్రీక్వెల్ ప్రమోషన్స్ లో మరో అప్డేట్ ఇచ్చారు. కాంతార చాప్టర్-1 మరికొద్ది రోజుల్లో రిలీజ్ కానుండగా.. ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు రిషబ్. అందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో జై హనుమాన్ కోసం మాట్లాడారు. కాంతార: చాప్టర్ 1 విడుదలకు ముందు తాను ఏ సినిమాకు కమిట్ అవ్వాలనుకోలేదని చెప్పారు. కానీ ప్రశాంత్ వర్మ తనకు జై హనుమాన్ కథ చెప్పారని అన్నారు. అది విన్న వెంటనే జై హనుమాన్ ప్రాజెక్టుకు సంతకం చేశానని, అద్భుతమైన స్క్రిప్ట్ అని తెలిపారు. కథ చాలా ఆసక్తికరంగా ఉండగా.. ఇప్పటికే ఫోటోషూట్ పూర్తి చేశామని చెప్పారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని అన్నారు. త్వరలో జై హనుమాన్ షూటింగ్ ప్రారంభించడానికి తేదీని నిర్ణయిస్తామని వెల్లడించారు. దీంతో మరికొద్ది రోజుల్లో షూటింగ్ మొదలవ్వనున్నట్లు తెలుస్తోంది.

# డైరెక్టర్‌గా నారా వారబ్బాయి?



నారా వారసుడు రోహిత్ పరిచయం అసవరం లేని పేరు. 'బాణం' తో హీరోగా ఎంట్రీ ఇచ్చిన రోహిత్ కథాబలం ఉన్న చిత్రాల్లో నటించి నటుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. నారా వారసుడు రోహిత్ పరిచయం అసవరం లేని పేరు. బాణంతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన రోహిత్ కథాబలం ఉన్న చిత్రాల్లో నటించి నటుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. రెగ్యులర్ కమర్శియల్ చిత్రాలకు భిన్నంగా రోహిత్ కథలు ఎంచుకోవడమే అతడి ప్రత్యేకగా కనిపిస్తుంది. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ స్పెషాల్టీ ఉందని ప్రూవ్ చేసాడు. తెలుగు సినిమా కమర్శియల్ పంథాలో ఉన్న రోజుల్లో ఇలాంటి కథలతో సినిమాలు చేయడం అంటే రిస్క్ అయినా? సాహసించి సక్సెక్స్ అయిన నటుడు. ఆరేళ్లలో మూడు సినిమాలే: కమర్శియల్ గా పెద్ద స్టార్ కానప్పటికీ స్టోరీల ఎంపికల్లో తానో యూనిక్. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో కోర్స్ చేసిన అనుభవం కూడా రోహిత్ కు ఉంది. 2018 వరకూ యాక్టివ్ గా సినిమాలు చేసాడు. ఆ తర్వాత ఒక్క సారిగా స్పీడ్ తగ్గించాడు. 2018-25 మధ్యలో మూడు సినిమాలు మాత్రమే చేసాడు. 'ప్రతినిధి2' గత ఏడాది రిలీజ్ అయింది. 'భైరవం', 'సుందరకాండ' సినిమాలు ఇదే ఏడాది రిలీజ్ అయ్యాయి.

# రౌడీ రెండు పడవల ప్రయాణం



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండకు ఈ మధ్య ఏం చేసినా పెద్దగా కలిసిరావడం లేదు. కింగ్‌డమ్ తర్వాత విజయ్, రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. విజయ్ హీరోగా నటించిన ట్యాక్సీవాలా మూవీతో డైరెక్టర్ గా పరిచయమైన రాహుల్, ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్ తో మరో హిట్ ను అందుకున్నారు. ఈ నెలాఖరు నుంచి రెండో షెడ్యూల్ ఇప్పుడు రాహుల్ మూడో సినిమాను విజయ్ దేవరకండ హీరోగానే చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లి ఓ షెడ్యూల్ ను పూర్తి చేసుకోగా, ఇప్పుడు ఈ మూవీ రెండో షెడ్యూల్ కు రెడీ అవుతుంది. అక్టోబర్ 2న విజయ్ కొత్త సినిమా లాంచ్ వీడీ14లో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుండగా, ఈ మూవీ 1854-78 మధ్య కాలంలో జరిగే కథగా తెలుస్తోంది. వీడీ14 తో పాటూ విజయ్ మరో సినిమాను కూడా లైన్ లో పెట్టిన సంగతి తెలిసిందే. రాజా వారు రాణి గారు, అశోక వనంలో అర్జున కళ్యాణం ఫేమ్ రవి కిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ ఓ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా ఆ సినిమా అక్టోబర్ 2న లాంచ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట.

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006.
AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR